నమస్తే తెలంగాణ
కరీంనగర్
5 | కరీంనగర్, శుక్రవారం 22 మార్చి 2024 | KARIMNAGAR

# గెలిపించండి.. అభివృద్ధి చేసి చూపిస్తా

- కేంద్రంలో ఏ ప్రభుత్వమున్నా నిధులు తెస్తా
- ఐదేళ్లలో బండి సంజయ్ చేసిందేంటి?
- ఎన్నో అవకాశాలున్నా ఏం చేయలే
- బీఆర్ఎస్ కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి వినోద్‌కుమార్



కరీంనగర్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే (సర్కస్)గ్రౌండ్‌లో మార్నింగ్ వాక్‌లో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్, మార్చి 21 : పార్లమెంట్ ఎన్నికల్లో తనను గెలిపించాలని మాజీ ఎంపీ, బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా నిధులు తెస్తానని, కరీంనగర్‌ను మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని స్పష్టం చేశారు. ఈ ఐదేళ్లలో ఎన్నో అవకాశాలున్నా ఎంపీ బండి సంజయ్ చేసిందేమీ లేదని విమర్శించారు. పదేళ్ల మోదీ పాలనలో ఐదేళ్లు తాను, ఐదేళ్లు సంజయ్ ఎంపీలుగా ఉన్నామని, తన ఐదేళ్ల పాలనలో ఏం చేశానో చెప్పానని, మరి ఆయన ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యక్తిగత దూషణలు వద్దని, అభివృద్ధిపై అర్థవంతంగా చర్చిద్దామని సూచించారు. అధికారం కోసమో, రాజకీయాల కోసమో రాలేదని, తాను విద్యార్థి రాజకీయాల నుంచి వచ్చానని, ప్రజలకు సేవచేయాలనే ఉద్దేశ్యతో వచ్చానని చెప్పారు. గురువారం ఉదయం కరీంనగర్‌లోని మహాత్మా జ్యోతిబా పూలే (సర్కస్) గ్రౌండ్‌లో వాకర్స్‌ను కలుసుకొని ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బండి సంజయ్ ఐదేళ్లు ఎంపీగా ఉన్నారని, కేంద్రంలో కూడా వారి పార్టీయే అధికారంలో ఉందని, ప్రత్యేకంగా నిధులు తెచ్చి పార్లమెంట్‌ను అభివృద్ధి చేసే అవకాశాలున్నా ఏమీ చేయలేదని దుయ్యబట్టారు. తాను సర్కస్ గ్రౌండ్‌ను సుందరంగా తీర్చిదిద్దానని, ఇప్పుడు ప్రజలు ఉదయం, సాయంత్రం వాకింగ్‌తోపాటు కుటుంబసభ్యులతో వచ్చి ఆనందంగా గడుపుతున్నారని పేర్కొన్నారు. నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్న ఆలోచనతో స్మార్ట్‌సిటీలో చేర్పించి రూ.వెయ్యి కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. స్మార్ట్‌సిటీలో ఇప్పటికే ₹750 కోట్లతో చేపట్టిన పనులు పూర్తయ్యాయన్నారు. ఎంపీగా ఉన్నప్పుడు కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు రైల్వే లైన్ ఉండాలని అప్పుడు ప్రధాని మోదీ చేతుల మీదుగా శంకుస్థాపన చేయించామన్నారు. దీనికి సంబంధించి పనులు కూడా వేగంగా సాగుతున్నాయన్నారు. జాతీయ రహదారుల హబ్‌గా కావాలన్న ఆలోచనతో సూపరింటెండెంట్ కార్యాలయాన్ని తీసుకువచ్చామని, రాజీవ్ రహదారిని జాతీయ రహదారిగా తీర్చిదిద్దాలని ప్రయత్నాలు చేశామన్నారు. అలాగే, వరంగల్ నుంచి కరీంనగర్ రైల్వే లైన్ కోసం సర్వే చేయించామని, కానీ దురదృష్టవశాత్తు పనులు ప్రారంభం కాలేకపోయాయన్నారు. అభివృద్ధి చేయాలన్న ఆలోచన సంజయ్‌కి లేదన్నారు. తాను ఎంపీగా ఉన్నప్పుడు ట్రిపుల్‌ఐటీ తీసుకురావాలని తీవ్ర ప్రయత్నం చేశామని, కానీ సంజయ్ ఎంపీగా గెలిచిన తర్వాత దానిని పట్టించుకోలేదని మండిపడ్డారు. కరీంనగర్‌ను ఓ విద్యా హబ్‌గా మార్చాలని ట్రిబుల్ ఐటీతోపాటు ఎన్సీఈఆర్టీ, ఐఐఎం కోసం ఎన్నో ప్రయత్నాలు చేశామన్నారు. కార్యక్రమంలో నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు, బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు వాల రమణరావు, కుర్ర తిరుపతి, ఐలేందర్, కంసాల శ్రీనివాస్, నాయకులు దూలం సంపత్, జక్కుల నాగరాజు, శ్రీనివాస్, మధుసూదన్, తిరుపతి, మహేశ్ పాల్గొన్నారు.

# ఇబ్బంది లేకుండా కరెంట్ సరఫరా

కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ గంగాధర్

నమస్తే ఎఫెక్ట్

కరీంనగర్, మార్చి 21(నమస్తే తెలంగాణ ప్రతినిధి) : 'కరెంటు కష్టాలు.. కర్షకుల కన్నీళ్లు' పేరిట గురువారం 'నమస్తే తెలంగాణ'లో ప్రచురితమైన కథనంపై విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ఈ మేరకు గురువారం కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్, డీఈ జే రాజం, ఏడీఈ కొలుపుల రాజు, ఏఈ నరేశ్‌తో కలి సి నల్లగుంటపల్లె, మొగ్దంపూర్, చేగుర్తి, ఇరుకుల్ల గ్రామాల్లో క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల స మస్యలు తెలుసుకున్నారు. అనంతరం అధికారులు మాట్లా డుతూ, నల్లగుంటపల్లె, ఇరుకుల్ల వాగు పరీవాహక ప్రాంత రైతులు తమ పొలాలు పారించుకునేందుకు వాగు లో బావులు తవ్వుకున్నారని, వంతుల వారీగా బావి నుంచి నీరు పెట్టుకుంటున్నారని తెలిపారు. వాగులో నీరు లేకపోవడంతోపాటు బావుల్లో భూగ ర్భ జలాలు అడుగంటడం పొలాలకు సరిపడా నీరు అందడం లేదన్నారు. దీంతో బావుల్లో ఊరిన నీరు ఊరినట్లుగా ప్రతి ఒకటి రెండు గంటలకోసారి విరామం ఇచ్చి పొలాలు పారించుకుంటున్నారని తెలిపారు. రైతులకు రేయింబవళ్లు మెరుగైన విద్యుత్ అందించడానికి తమ అధికారులు, సిబ్బంది ఆహర్నిశలు పని చేస్తున్నారని తెలిపారు. ఎక్కడైనా అవాంతరాలు ఎదురైతే సమాచారం ఇస్తే వెంటనే చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

# మన కరీంనగర్‌లో గ్రాండ్ ఆటో షో

**23, 24 తేదీల్లో మహాత్మా జ్యోతిబా పూలే మైదానం వేదికగా ఎక్స్‌పో**

'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో నిర్వహణ

- మీ ముందుకు సరికొత్త వాహనాలు
- అందుబాటులో ప్రముఖ సంస్థల కార్లు, బైక్‌లు
- పాల్గొననున్న బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు



*మీరు కొత్తగా బైక్ లేదా కారు కొనుగోలు చేయాలనుకుంటున్నారా..? ఏ కంపెనీది అయితే బాగుంటుంది అని ఆలోచిస్తున్నారా..? లోన్‌కు వెళ్తే ఏఏ బ్యాంకుల వడ్డీ శాతం ఎంత? అనే వివరాలు తెలుసుకోవాలనుకుంటున్నారా..? అయితే మీ కోసమే 'నమస్తే తెలంగాణ' చక్కని అవకాశాన్ని కల్పిస్తున్నది. ప్రముఖ కార్ల, ద్విచక్ర వాహనాల సంస్థలు, ప్రధాన బ్యాంకులతోపాటు కొత్త మోడల్ బైకులు, కార్లను ఒకే వేదికగా మీ ముందుకు తీసుకొస్తున్నది. ఈ నెల 23 ,24 తేదీల్లో కరీంనగర్ జిల్లా కేంద్రంలోని మహాత్మా జ్యోతిబా పూలే మైదానం (సర్కస్ గ్రౌండ్ )లో మెగా ఆటో షో నిర్వహిస్తున్నది. శనివారం ఉదయం 10 గంటలకు ప్రారంభమై, ఆదివారం రాత్రి ఎనిమిది గంటలకు ముగిసే ఈ ప్రదర్శనకు ఎంట్రీ ఉచితమని, వివరాలకు 9182777571, 9182777572 సెల్‌నంబర్లలో సంప్రదించాలని 'నమస్తే' యాజమాన్యం పేర్కొంది.*

కార్పొరేషన్, మార్చి 21: ప్రస్తుత ఆధునిక సమాజంలో బైక్ ప్రతి ఒక్కరికీ నిత్యావసర వస్తువుగా మారింది. కానీ, బైక్‌తోపాటు కారు కూడా ఇంట్లో ఉండాల్సిన పరిస్థితులు వచ్చాయి. కాలానుగుణంగా వస్తున్న మార్పులతో వాహనాల వినియోగం పెరిగింది. ప్రజల్లోనూ ఆధునిక బైక్స్, కార్ల మోడల్స్‌పై ఆసక్తి కనిపిస్తున్నది. గతంలో బైక్ అంటే ప్రయాణాలకు మాత్రమే అన్నట్టుగా ఉండేది. కానీ ఇప్పుడు బైక్‌లో దారి చూపే మ్యాప్, ఫోన్ ఛార్జ్, డిజిటల్ మీటరింగ్ ఇలా ఎన్నో సౌకర్యాలను ప్రజలు కోరుకుంటున్నారు. ఇదే సమయంలో ఈబైక్‌లపై ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ముఖ్యంగా మహిళలు ఈ వాహనాలను కొనేందుకు మక్కువ చూపుతున్నారు. మరోవైపు కుటుంబంలో నలుగురు సభ్యులు ఉంటే చాలు కారు కొనుగోలు చేయాలని ఆలోచన చేస్తున్నారు. కరోనా కాలంలో ఎక్కువ మంది వ్యక్తిగత రవాణాకు అలవాటు పడడంతో సొంత వాహనాల కొనుగోలుకు ఇష్టపడుతున్నారు.

## పెరుగుతున్న వాహనాలు

కంపెనీలు సరికొత్త వాహనాలను మార్కెట్లోకి తీసుకొస్తున్నాయి. తక్కువ ధరలోనే నయా మోడళ్లను అందుబాటులో ఉంచుతున్నాయి. ఎప్పటికప్పుడు ఆఫర్లు కూడా ప్రకటిస్తున్నాయి. ఇటు బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు అతి తక్కువ వడ్డీకే లోన్లు ఇస్తున్నాయి. జీరో డౌన్ పేమెంట్ లేదా అతి తక్కువ డౌన్ పేమెంట్ చేసినా రుణాలు అందిస్తున్నాయి. ఇవన్నీ వినియోగదారులను ఆకర్శిస్తున్నాయి. మరోవైపు బైక్ అయినా.. కారు అయినా అవసరంగా మారిన నేపథ్యంలో వాహనాల కొనుగోళ్లు జోరుగా సాగుతున్నాయి. హైదరాబాద్ తర్వాత అత్యధికంగా వాహనాలు ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే అమ్ముడవుతున్నాయి. మన జిల్లాలో ఇటీవలి కాలంలో వాహనాల సంఖ్య భారీగా పెరిగినట్లు రవాణా శాఖ అధికారిక లెక్కలు చెబుతున్నాయి. ప్రస్తుతం జిల్లాలో ఉన్న ఇండ్ల కంటే కూడా ద్విచక్ర వాహనానే ఎక్కువగా ఉన్నాయి. ప్రతి ఇంటిలోనూ రెండు, మూడు బైక్‌లు కనిపిస్తున్నాయంటే ఆశ్చర్యపోనవసరం లేదు. కరోనా తర్వాత కార్లు కొనుగోళ్లు కూడా పెరుగుతూనే ఉన్నాయి. గతంలో చేతిలో పూర్తి స్థాయి డబ్బులు ఉంటేనే వాహనం కొనే పరిస్థితి ఉండగా, ఇప్పుడు లోన్లు ఇస్తుండడంతో ప్రజలు కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు. మరోవైపు రవాణాలో కీలకమైన ఆటోలకు కూడా తక్కువ వడ్డీలతో రుణాలు అందిస్తుండగా, నిరుద్యోగులు కొనుగోలు చేసి ఉపాధి పొందుతున్నారు.

## రేపు నగరంలో ఆటో షో

ఏటా ఉమ్మడి జిల్లా పరిధిలో వాహనాల సంఖ్య పెరుగుతూనే ఉన్నది. ముఖ్యంగా మన జిల్లా వేగంగా అభివృద్ధి చెందుతుండడం, వ్యవసాయ రంగంలో అద్భుతమైన ప్రగతి సాధించడంతో ప్రతి ఒక్కరికీ ద్విచక్ర వాహనం, ఇంటికో కారు కనిపిస్తున్నది. ఈ క్రమంలోనే ఔత్సాహిక కొనుగోలుదారులందరికీ అన్ని వివరాలు ఒకే వేదికపై అందించాలన్న ఉద్దేశంతో కరీంనగర్‌లోని మహాత్మాజ్యోతిబాపూలే (సర్కస్ గ్రౌండ్) మైదానంలో 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో ఈ నెల 23, 24 తేదీల్లో ఆటో షో నిర్వహిస్తున్నారు. ఈ షోలో దేశంలోని ప్రముఖ వాహనాల సంస్థలతోపాటు రుణాలు అందించే బ్యాంకులు, ఫైనాన్స్ సంస్థలు కూడా పాల్గొంటున్నాయి. ఈ షోకు మెయిన్ స్పాన్సర్ ఆదర్శ ఆటో మోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్, అసోసియేట్ స్పాన్సర్లుగా మహావీర్ గ్రూప్ మెర్సిడిస్ బెంజ్, ఆడి హైదరాబాద్, వోల్వో, మహావీర్ ఐసుజు, ప్రైడ్ జీప్, గ్రీన్ హోండా, మోటార్ లైన్ మహేంద్ర డీలర్, క్వాంటం ఈ స్కూటర్స్, కాకతీయ టయోటా, మారుతి సుజుకి, నెక్సా, మాతరుతి సుజుకి ఎరేన, ఆదర్శ ట్రూ వాల్యూ, మాలిక్ కియా, హబురా సుజుకి సంస్థలు, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియాతో పాటుగా ఇతర సంస్థలు పాల్గొంటున్నాయి.





మాట్లాడుతున్న బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్, వేదికపై ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్‌రావు, జడ్పీ అధ్యక్షురాలు వసంత

# బీజేపీ, కాంగ్రెస్‌కు అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదు

- బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్
- మెట్‌పల్లి, కోరుట్లలో బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాలు

మెట్‌పల్లి రూరల్, మార్చి 21 : 'కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ అవలంబిస్తున్న విధానాలతో భవిష్యత్ అంధకారం అవుతుందని బీఆర్ఎస్ నిజామాబాద్ ఎంపీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ధ్వజమెత్తారు. ఓ పార్టీ హిందూత్వమే జెండాగా, మరోపార్టీ ఆచరణకు సాధ్యం కాని హామీలతో ప్రజలను మభ్య పెడుతూ ఓట్లు దండుకునేందుకు సిద్ధమయ్యాయని విమర్శించారు. ఆ రెండు పార్టీలకు తప్పుడు ప్రచారాలు, సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసం చేయడమే తెలుసని, అభివృద్ధిపై చిత్తశుద్ధి లేదని మండిపడ్డారు. గురువారం మెట్‌పల్లి మండలం వెల్లుల్ల శివారులో, కోరుట్ల పట్టణంలో వేర్వేరుగా జరిగిన పట్టణ, మండల ముఖ్య కార్యకర్తల సమావేశాలకు కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ సర్కారు మేడిగడ్డ బరాజ్‌ను మరమ్మతు చేయకుండా ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందన్నారు. రాష్ట్రంలో పింఛన్లు, ఉద్యోగులకు జీతాలు కూడా సకాలంలో చెల్లించలేని దుస్థితిలో రేవంత్ సర్కారు ఉందని విమర్శించారు. కేంద్రంలో పదేళ్లు పాలించిన బీజేపీ సంక్షేమం, అభివృద్ధిని విస్మరించిందని, ఎన్నికలు రాగానే ఓట్లు దండుకునేందుకు హిందూత్వాన్ని ఎజెండాగా మార్చుకుందని దుయ్యబట్టారు. కేసీఆర్ ఆదేశాల మేరకు నిజామాబాద్ ఎంపీగా పోటీ చేస్తున్నానని, కార్యకర్తలు కష్టపడి పనిచేస్తే విజయం మనదేనని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ బోయినపల్లి చంద్రశేఖర్, ముఖ్య నాయకులు రాణవేని సత్యనారాయణ, ఒజ్జెల బుచ్చిరెడ్డి, కొమిరెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మతం పేరిట రెచ్చగొట్టడమేనా..?

బీజేపీలో ఉన్న వారే హిందువులన్న రీతిలో ఆ పార్టీ వ్యవహరిస్తున్నది. మతం ముసుగులో ప్రజలను రెచ్చగొట్టడమే సిద్ధాంతంగా పెట్టుకున్నది. కాంగ్రెస్ వంద రోజుల పాలనలో సాగునీరు లేక పొలాలు ఎండిపోతున్నయి. ఇలాంటి అసమర్థులను నమ్మి మళ్లీ ఓటేస్తే అంధకారమే మిగులుతుంది. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయానికి కార్యకర్తలు కష్టపడి పనిచేయాలి.

- కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు, బీఆర్ఎస్ జగిత్యాల జిల్లా అధ్యక్షుడు

## దళితులపై దాడులను ఖండించరా..?

ఎంపీ ధర్మపురి అర్వింద్ బీసీ నినాదంతో ఓట్లు దండుకోవాలని చూస్తున్నడు. చేనేత కార్మికులు కష్టాల్లో ఉంటే ఎందుకు ఆదుకోవడం లేదు? దళితులపై కాంగ్రెస్ నాయకులు చేస్తున్న దాడులను ఎందుకు ఖండించడంలేదు? రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకుల ఆగడాలు మితిమీరిపోయినయి. బీఆర్ఎస్ నాయకులు ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదు. బీఆర్ఎస్ విజయమే లక్ష్యంగా కలసికట్టుగా పని చేసి నిజామాబాద్‌లో గులాబీ జెండా ఎగురవేద్దాం. నిఖార్సైన కార్యకర్తలెప్పుడూ పార్టీని విడిచి వెళ్లరు. స్వార్థపరులే పార్టీలు మారుతరు.

— డాక్టర్ సంజయ్ కల్వకుంట్ల, కోరుట్ల ఎమ్మెల్యే

# కొండగట్టు ఆలయ ఉద్యోగులకు మోమోలు

మల్యాల, మార్చి 21: కొండగట్టు అంజన్న ఆలయ దుకాణాల లీజు వసూళ్లలో గోల్‌మాల్‌పై దేవాదాయశాఖ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. 'కొండగట్టు లీజులో గోల్‌మాల్' అంటూ ఈ నెల 18న 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురితం కాగా దేవాదాయ కమిషనర్ హన్మంతరావు ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ జ్యోతి, అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్ మూడు రోజుల క్రితం కొండగట్టులో విచారణ చేపట్టిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే రికార్డుల నిర్వహణ, పర్యవేక్షణ సరిగా లేకపోవడం, విధుల్లో అలసత్వం ప్రదర్శించినందుకుగాను పర్యవేక్షకుడితోపాటు సీనియర్ అసిస్టెంట్‌కు ఈవో టంకశాల వెంకటేశం మోమోలు జారీ చేశారు. 48 గంటల్లోగా వివరణ ఇవ్వాలని, లేదంటే క్రమశిక్షణ చర్యలుంటాయని మోమోలో పేర్కొన్నారు.





స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకువస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా, కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

# వైభవం.. నృసింహుడి కల్యాణోత్సవం

ధర్మపురి,మార్చి21: ధర్మపురి లక్ష్మీనరసింహస్వామివారి కల్యాణోత్సవాలు అంగరంగ వైభవంగా సాగుతున్నాయి. గురువారం పెద్దసంఖ్యలో తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. రాత్రి వేళ శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. నమోఃనారసింహ నామస్మరణతో ఆలయ ప్రాంగణం ప్రతిధ్వనించింది. వేడుకలకు రాష్ట్ర బీసీ సంక్షమే శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, వేములవాడ ఎమ్మెల్యే, విప్ ఆది శ్రీనివాస్, జగిత్యాల కలెక్టర్ యాస్మిన్ బాషా హాజరయ్యారు. ఉదయం కలెక్టర్ ప్రభుత్వ పక్షాన స్వామివారికి పట్టువస్త్రాలు, కల్యాణ తలంబ్రాలను సమర్పించారు. పట్టువస్త్రాలతో ఆలయానికి చేరుకున్న కలెక్టర్‌కు ఆలయ సిబ్బంది మేళతాళాల మధ్య ఘన స్వాగతం పలికారు. వేద పండితులు మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలు నిర్వహించి ఆమెను ఘనంగా ఆశీర్వదించారు.

